www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

సోమవారం 13.01.2025



వలస కుటుంబాలకూ

# రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

## మంత్రి పొన్నం ప్రభాకర్

- సంక్షేమ పథకాల అమలులో హైదరాబాద్
- రాష్ట్రానికి మార్గదర్శకంగా నిలవాలి
- ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లందరూ కలిసి పని చేయాలి
- ఈ నెల 16 నుంచి 20 వరకు లబ్దిదారుల పరిశీలన
- 21న ఆన్ లైన్ లో వివరాల నమోదు..
- 26నుంచి కార్డులు

4లో



# ప్రజాస్వామ్యంలో పాలక, విపక్షాలు సమానం

మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు

- ఐక్యరాజ్య సమితిలో మాట్లాడాలని పీవీ.. ప్రతిపక్ష నేత వాజ్ పేయిని పంపారు
- పార్టీలు వేరైనా.. సాంస్కృతిక జాతీయ వాదం అందరిలో ఉంది

**అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా నడవాలి : సీఎం రేవంత్‌రెడ్డి**




**కలంజ్యోతి, హైదరాబాద్ :**
ప్రజాస్వామ్య దేశంలో పాలక పక్షానికి, విపక్షాలకు పెద్ద తేడా ఏమీ లేదని, అవి రెండు కలిస్తేనే పాలనసాగుతుందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు అన్నారు. హైదరాబాద్‌లో ని తాజ్ కృష్ణ హోటల్ లో మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు ఆత్మకథ 'ఉనిక' పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణ అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా నడవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన, కావాల్సిన నిధులను తెచ్చుకోవడంలో అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, హైదరాబాద్‌ను విశ్వ నగరంగా తీర్చిదిద్దాలంటే మెట్రో రైలు, రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్ వంటి ప్రాజెక్టులు అవసరమని అన్నారు. హైదరాబాద్ మెట్రో దేశంలోనే రెండో స్థానంలో ఉండగా, గడిచిన పదేళ్లలో ఎలాంటి ప్రగతి లేని కారణంగా 9 వ స్థానానికి పడిపోయిందని, కేంద్ర మంత్రిమండలి రాబోయే సమావేశంలో మెట్రో విస్తరణకు ఆమోదముద్ర పడేలా నాయకులు చొరవ చూపాలని కోరారు. తెలంగాణ అభివృద్ధిని ఇప్పుడు విస్మరిస్తే మరెప్పుడూ ముందుకుపోలేమని అన్నారు. దేశాన్ని 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తయారు చేయడంలో తెలంగాణ వంతు సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రధానమంత్రి కి చెప్పానని, ఆ సాధన దిశగా తెలంగాణలో అభివృద్ధి పనులకు కేంద్రం సహకరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణకు పోర్టు లేని కారణంగా డ్రై పోర్టుకు అనుమతి ఇవ్వాలని, అలాగే

మిగతా 2లో

# నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

కలంజ్యోతి, హైదరాబాద్ :
సంక్రాంతి సంబరాల్లో భాగంగా నేటి నుంచి 15వ తేదీ వరకు పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నేపథ్యంలో నగర పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. రోటరీ ఎక్స్ రోడ్ నుంచి ఎస్‌బీహెచ్ కు వెళ్లే దారి.. వైఎంసీఏ నుంచి క్లాక్ టవర్‌కు మళ్లింపు చేస్తారు. రసూల్ పురా నుంచి ప్లాజాకు వెళ్లే దారి.. సీటీవో ఎక్స్ రోడ్స్ నుంచి బలంరాయికి మళ్లించారు. పికెట్ నుంచి ఎస్ బీహెచ్ & టివోలికి వెళ్లే మార్గం.. స్వీకార్ ఉపకర్ వద్ద వైఎంసీఏకు మళ్లించారు. ఎన్ సీసీ నుంచి ప్లాజాకు వెళ్లే మార్గం.. టీవోలి వద్ద నుంచి బ్రూక్‌బాండ్‌కు మళ్లించారు. ఈ ఆంక్షల్ని దృష్టిలో పెట్టుకొని.. ప్రత్యామ్నాయ మార్గాల్లో గమ్య స్థానాలకు చేరాలన్న ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. కాగా ఈ ఉత్సవాలకు హాజరయ్యే ప్రేక్షకులకు గేట్ నం.1 నుంచి అనుమతించారు. ఐదు ప్రాంతాల్లో పార్కింగ్‌కి వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.





# ప్రజాస్వామ్యంలో పాలక, విపక్షాలు సమానం

**» మొదటిపేజీ తరువాయి**

సమీపంలోని బందరు రేవుకు కనెక్టివిటీ ఉండాలన్న విషయాన్ని కూడా ప్రధాని దృష్టికి తెచ్చామన్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని అంశాన్ని కూడా ప్రధాని సహకారం కోరామని, ఇలాంటి విషయాల్లో తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు సహకరించాలని కోరారు. తెలంగాణలో 60 శాతం ఆదాయం హైదరాబాద్ నగరం నుంచే వస్తోందని, హైదరాబాద్ దేశంలోని ఏ ఇతర నగరాలతో కాకుండా న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతో పోటీ పడుదామని చెప్పారు. తమిళనాడులో రాజకీయంగా ఎన్ని వైరుధ్యాలు ఉన్నప్పటికీ రాష్ట్రానికి సంబంధించిన అంశాల్లో సమిష్టిగా పనిచేస్తారని ఉదహరిస్తూ తెలంగాణ అభివృద్ధికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు ముందుండి పోరాటాలు చేశారని గుర్తుచేస్తూ ప్రత్యేక రాష్ట్రంలో ఉన్నామంటే విద్యార్థులు రాజకీయాల్లో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించడమేనని అన్నారు.

విద్యార్థి దశలో సిద్ధాంతపరమైన రాజకీయాలు చేస్తే పార్టీకి కట్టుబడి ఉంటారని, అలాంటి రాజకీయాలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో రాణించాలని భావించే వారు ఉనిక పుస్తకాన్ని చదవాలని అన్నారు. చట్టసభల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిపక్షం ఎత్తి చూపించాలని, కాలక్రమేణా ప్రజాస్వామ్య స్ఫూర్తిని కోల్పోతున్నామని, ప్రజాస్వామిక స్ఫూర్తిని ప్రదర్శించాలన్న ఉద్దేశంతోనే గత 13 నెలల్లో జరిగిన అసెంబ్లీ తీరుతెన్నులే ఉదహారణగా చెప్పారు. ఉత్తర తెలంగాణ ప్రాంతం సస్యశ్యామలం కావాలంటే గోదావరి జలాలు తీసుకురావాలని సాగర్ జీ పాదయాత్ర చేశారని, అలాగే గోదావరి జలాల వినియోగం కోసం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టును తీసుకొచ్చారని అన్నారు. గోదావరి జలాల వినియోగంపై సాగర్ జీ సలహాలు, సూచనలు ఎంతో అవసరమని, మహారాష్ట్రలో మునుగుతున్న భూములకు సంబంధించిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడమని గతంలో నేను సాగర్ జీని కోరిన విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తనకు భేషజాలు లేవని, తెలంగాణ కోసం ఎవరినైనా కలుస్తా, అందరి సహకారం తీసుకుంటానని అన్నారు. సాగర్ జీ గవర్నర్‌గా మహారాష్ట్ర, తమిళనాడు రెండు రాష్ట్రాల్లో సమర్థవంతంగా పనిచేసి తెలంగాణ గౌరవాన్ని నిలబెట్టారు.విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడం కోసం రాష్ట్రంలో 75 ఐటీఐలను ఏటీసీలుగా మార్చడం, ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, దాని ఆవశ్యకత, క్రీడల అభివృద్ధికి స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ వంటి పలు కీలక అంశాలను వేదిక నుంచి ముఖ్యమంత్రి గారు వివరించారు. కార్యక్రమంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఒడిసా గవర్నర్ కే.హరిబాబు, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్, ఎంపీ కే.లక్ష్మణ్ , మాజీ ఎంపీలు టీ.సుబ్బిరామిరెడ్డి, బి.వినోద్ కుమార్ పాల్గొన్నారు.






## రోడ్డు భద్రత మాసోత్సవాలు

**కలంజ్యోతి, మల్యాల** : మల్యాల మండలంలో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం పాటల పాడుతూ రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ. సాగర్ రావు, బొట్ల ప్రసాద్, శ్రీనివాస్ గౌడ్, నేరెళ్ళ సతీష్ రెడ్డి, నల్లపు మల్లేశం, శనిగారపు తిరుపతి, తాళ్ళ హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళను కాపాడిన పోలీసులు

**కలంజ్యోతి, నిర్మల్** : క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రాణాంతకంగా మారటం సహజం. ఇలా కుటుంబ కలహాలతో ఆత్మహత్యా యత్నం చేసిన మహిళను పోలీసులు కాపాడారు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో ఒక వివాహిత కుటుంబ కలహాలతో క్షణికావేశంలో ఆత్మహత్యకు నిర్ణయించింది. స్థానిక కంచరోని చెరువులోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న విషయాన్ని అటుగా వెళ్తున్న కొంతమంది పోలీసులకు చేరవేశారు. పట్టణ బ్లూ కోల్ట్స్ సిబ్బంది కానిస్టేబుళ్లు ఎన్. గణేష్, తిలక్ ఘటన స్థలానికి చేరుకొన్నారు. వివాహితను ఆత్మహత్య చేసుకోకుండ నివారించగలిగారు. ఆమెను వారి కుటుంబ సభ్యులకు అప్పగించి ఆమె కుటుంబీకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

## పరస్పర సహకారంతో దేశాభివృద్ధి

### సహకార భారతి రాష్ట్ర సంఘటనా ప్రముఖ్ యాదగిరి



**కలంజ్యోతి, నిర్మల్ :**

పరస్పర సహకారంతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని సహకార భారతి రాష్ట్ర సంఘటనా ప్రముఖ్ పొన్నాల యాదగిరి అన్నారు. పాన్ ఇండియా సంస్థ సహకార భారతి 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని సహకార భారతి నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్మల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన స హకార భారతి రాష్ట్ర సంఘటన ప్రముఖ్ పొన్నాల యాదగిరి మాట్లాడుతూ 1979,జనవరి 11న శ్రద్దేయ లక్ష్మన్ రావు ఇనాందార్ సహకార భారతిని ప్రారంభించారన్నారు. సహకార రంగం ద్వారానే భారత దేశ అభివృద్ధి సాధ్యమని భావించి లక్ష్మన్ రావు సహకార భారతిని ప్రారంభించి అతి తక్కువ సమయంలో సహకార భారతి అతిపెద్ద ఎన్జీవో గా ఆవిర్భవించిందన్నారు. సహకార భారతి ఆధ్వర్యంలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 56 సహకార రంగాలలో దాదాపు 8 లక్షల సహకార సంస్థల ద్వారా 30 కోట్ల ప్రజలకు సహకారం అందించిం దన్నారు. సహకార భారతి ముఖ్య లక్ష్యం సహకార సంఘాలను బలోపేతం చేయడం, నూతన సహకార సంఘాలను స్థాపించడం వాటి ద్వారా ప్రజలకు వివిధ రకాల సేవలు అందించడమన్నారు. సహకార భారతి ఇందూర్ విభాగ్ ప్రముఖ్, లోకమాన్య సహకార సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు భూసారపు గంగాధర్ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో సహకార భారతి ఆధ్వర్యంలో లోకమాన్య సహకార సంఘాన్ని ప్రారంభించి సంవత్సర కాలంలోనే 500 మంది సభ్యులతో సహకార కార్యక్రమాలునిర్వహించామన్నారు. పేద, మధ్యతరగతి వారికి ఆర్థిక స్వావలంబన సామాజిక స్వావలంబన దిశగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. లోకమాన్య సహకార సంఘంలో సభ్యులకు ఆర్థిక సహకారం ద్వారా పేదలకు వ్యాపారస్తులకు అతి తక్కువ వడ్డీతో రుణ సౌకర్యం ఉందన్నారు. ఈ అవకాశాన్ని నిర్మల్ జిల్లా ప్రజలందరూ వినియోగించుకొని లబ్ధి పొందాలని వారు కోరారు. నిర్మల్ జిల్లాలో సహకార భారతి బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. దీనిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జిల్లా సంఘచాలక్ నూకల విజయ్ కుమార్, సహకార సంఘం ఉపాధ్యక్షులు శివరాం వెంకటేష్, కార్యదర్శి మహాజన్ సతీష్ కుమార్, సహకార భారతి జిల్లా కోశాధికారి దేష్కర్ భీమ్ రావ్, ఉపాధ్యక్షులు కిషన్ రావు, వ్యవస్థా ప్రముఖ్ పూదరి విజయకుమార్ డైరెక్టర్లు మైసర్ల వెంకటరమణ, జటల శ్రీనివాస్, నాలం మదన్ మోహన్, తాళ్ల సుదర్శన్, జద్వానీ వసంత్, ఆడేపు లలితశ్రీ, మంచిరాల వినీత రాణి, రాపర్తి అనూష, పొద్దుటూరి నరేష్ రెడ్డి, సోలాపూర్ రాజేశ్వర్, ఆడెపు సుధాకర్, మైసర్ల శంకర్, అల్లం దేవిదాస్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

# వివేకానందుడి జీవితం మార్గదర్శకం

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



**కలంజ్యోతి, నిర్మల్ :** తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, రచయిత అలిశెట్టి ప్రభాకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలిశెట్టి ప్రభాకర్ అలవోక పదాలతో కవిత్వం రాసి, సామాన్యుల గుండెల్లో నిలిచారని, ప్రజా చైతన్యం కోసం కవిత్వం రాశారని, అవినీతి దోపిడీ దౌర్జన్యా లపై అక్షర పిడిబాకులు దించారని, ఆరోగ్యాన్ని సహితం లెక్కచేయకుండా సాహితీ జీవితం కొనసాగించారని కవులు రచయితలు కొనియాడారు. అలిశెట్టి సాహిత్యాన్ని కవులు కళాకారులు రచయితలు ముందు తరాలకు అందించే విధంగా కృషి చేయాలని అన్నారు. స్వామి వివేకానంద తన జీవితాన్ని యువతకు మార్గదర్శకంగా ఉండేటట్టుగా జీవించారన్నారు. భారతీయ తాత్విక చింతనను తన ప్రసంగాల ద్వారా ప్రపంచ దేశాలకు తెలియజేశారని, చైతన్యపరిచే సూక్తుల ద్వారా ప్రజల గుండెల్లో నిలిచారని వక్తలు కొనియాడారు. తెలంగాణ రచయితల వేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ దామెర రాములు, అధ్యక్షులు నేరెళ్ల హనుమంతు, ఉపాధ్యక్షులు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, మానస సాహితీ సేవ సంస్థ అధ్యక్షులు డాక్టర్ తుమ్మల దేవరావు, నిర్మల భారతి గౌరవ అధ్యక్షులు బొందిడి పురుషోత్తమ రావు, తెరవే నిర్మల్ జిల్లా కోశాధికారి పోలీస్ భీమేష్, సలహా సభ్యులు పత్తి శివప్రసాద్, ఈసీ మెంబర్లు కామారపు జగదీశ్వర్, కుమ్మరి నాగారం, సభ్యులు అబ్బటి రాజేశ్వర్ రెడ్డి, మునీంద్ర రాజు పాల్గొన్నారు.



# వివేకానందుడికి నివాళి

**కలంజ్యోతి, మల్యాల :** స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఆదివారం మల్యాల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బ్లాక్ చౌరస్తాలోని విగ్రహంకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాజుల మల్లేశం, మిట్టపల్లి సుదర్శన్, సాగర్ రావు, బోట్ల ప్రసాద్, అల్లూరి రాజేశ్వర్ రెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, వీరబత్తిని ప్రసాద్, బోడ గోవర్ధన్, ముదాం శ్రీనివాస్, కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, బొబ్బిలి వెంకన్న, కొక్కుల రఘుబాబు, నల్లపు మల్లేశం, శనిగారపు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి



**కలంజ్యోతి, నర్సాపూర్ :**
నర్సాపూర్ పట్టణంలోని స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ నాయకులు ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి యువకులు వివేకానంద స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని వారు తెలిపారు. భారతదేశం యువత స్ఫూర్తి ప్రదాత మార్గదర్శి అని ప్రపంచవ్యాప్తంగా దశ దిశల జాతి చెప్పిన చైతన్య మూర్తి అని బిజెపి నాయకులు అన్నారు వివేకానంద చేసిన సేవలు ఎప్పటికీ మరువరాన్ని అని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.




# ఘనంగా వివేకానంద జయంతి

**కలంజ్యోతి, నిర్మల్ :** జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వివేక్ చౌక్ లో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, స్వామి వివేకానంద తన బోధనలతో యువతను సన్మార్గంలో నడిపించారన్నారు. యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని మంచి మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. అనంతరం అందరికీ మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, పెటా అధ్యక్షుడు భోజన్న, యువకులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కేరళలో బాలికపై 62 మంది లైంగిక దాడి!

14మందికి జ్యుడీషియల్ కస్టడీ

సుమోటోగా కేసు నమోదు చేసిన ఎన్‌సీడబ్ల్యూ

**తిరువనంతపురం :**
కేరళలో మైనర్ బాలిక (13)పై 62 మంది లైంగిక దాడికి పాల్పడ్డారు. 14 మంది నిందితులను పోలీసులు జ్యూడీషియల్ కస్టడీకి పంపారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఆదివారం వెలుగులోకొచ్చిన ఈ లైంగిక దాడిపై పతనంతిట్ట జిల్లాలోని రెండు పోలీస్ స్టేషన్లలో తొమ్మిది ఎఫ్ ఐఆర్ లు నమోదయ్యాయి. బాలిక స్పోర్ట్స్ కోచ్‌లు, తోటి అథ్లెట్లు, క్లాస్‌మేట్స్ లైంగికదాడులకు పాల్పడినట్లు ఆధారాలు లభించాయని పోలీసులు తెలిపారు. నిందితులందరినీ అరెస్టు చేయాలని జాతీయ మహిళా కమిషన్ (నేషనల్ వ్యూమన్ కమిషన్) మూడు నివేదికను సమర్పించాలని ఆదేశించింది. కేరళ మహిళా కమిషన్ అధ్యక్షురాలు పి. సతీదేవి సుమోటోగా కేసు నమోదు




చేశారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్వహించిన కౌన్సెలింగ్‌లో బాలిక ఈ విషయాలు చెప్పినట్లు ఎన్ సీ డబ్ల్యూ గుర్తించింది. బాలికపై లైంగిక దాడిలో ఇరుగు పొరుగు కూడా ఉన్నట్లు ధృవీకరించారు. లైంగిక దాడికి పాల్పడడమే గాకుండా బాలికకు సంబంధించిన వీడియోలను కూడా సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దీంతో ఈ విషయం వెలుగులొకొచ్చింది. ఈ లైంగిక దాడిపట్ల కేరళ పినరయి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

# బీజాపూర్‌లో ఎన్ కౌంటర్

ముగ్గురు నక్సల్స్ మృతి

రాయ్ పూర్: బీజాపూర్ లో భద్రతా బలగాలు, నక్సలైట్లకు మధ్య భారీ ఎన్ కౌంటర్ చోటు చేసుకుంది. ఆదివారం వేకువజాము నుంచి జరిగిన ఈ ఎన్ కౌంటర్ లో ముగ్గురు నక్సల్స్ మృతిచెందారు. నక్సలైట్ల నుంచి ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. భోపాల్ పట్నం లోని మద్దెడ్ ప్రాంతంలో బందేపరాకొరంజెడ్ అడవుల్లో భద్రతా బలగాలు, నక్సలైట్లకు మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. కూంబింగ్ కొనసాగుతుందని పూర్తయ్యాక వివరాలను వెల్లడిస్తామని భద్రతాధికారులు తెలిపారు. భద్రత బలగాలను అటవీ ప్రాంతాంలో భారీ కూంబింగ్ కు ఉపక్రమించడం పట్ల మరిన్ని ఎన్ కౌంటర్లు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.






## లీలావతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**విజేతలకు బహుమతులు అందజేసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

**కలంజ్యోతి, చెన్నారావుపేట :**

వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని మినీ స్టేడియంలో గోక లీలావతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరయ్యారు. పల్లె వాతావరణంలో ఏర్పాటు చేసిన ఎడ్లబండ్లు, భోగి మంటలు, రంగవల్లులు, కళాకారుల ఆటపాటలు కోలాటాలను తిలకించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం నుంచి తెలంగాణ ప్రాంతంలో జనవరి మాసంలో పంటలు చేతికి రావడం ధాన్యం సంక్రాంతి వేల చేతికి రావడంతో ఆనందంగా పండుగ జరుపుకుంటారన్నారు. ఇండ్ల ముందు ముగ్గులు వేసుకొని బంధుమిత్రులతో పశుపక్షాయులతో ఆనందంగా గడిపే వాళ్ళని గత అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వన అవార్డు గ్రహీత పోక రామస్వామి, బోక లీలావతి మెమోరియల్ ట్రస్ట్ సెక్రటరీ గోక వినోద్ బాబు, స్వప్న, ప్రజాప్రతినిధులు పెండం రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మెడలోంచి గొలుసు అపహరణకు యత్నం

**కలంజ్యోతి, మల్యాల :**

మల్యాల మండలం రామన్నపేట గ్రామానికి చెందిన వెల్మ సుగుణమ్మ అనే మహిళ మెడలోంచి ఇద్దరు వ్యక్తులు పుస్తెలతాడు అపహరణకు యత్నించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఆదివారం ఉదయం సుగుణమ్మ వ్యవసాయ పనులకు వెళ్లగా, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఒక బైక్ పై వచ్చి మెడలోని బంగారు పుస్తెలతాడును తెంపే ప్రయత్నం చేశారు. వెంటనే ఆమె గట్టిగా కేకలు వేయడంతో దుండగులు వదిలేసి పారిపోయినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# వలస కుటుంబాలకూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

## మంత్రి పొన్నం ప్రభాకర్

**కలంజ్యోతి, హైదరాబాద్ :**

తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్ మహా నగరానికి వలస వచ్చిన వారికి కూడా కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హైదరాబాద్ జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి త్వరలోనే లబ్ధిదారులకు కేటాయిస్తామని చెప్పారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో హైదరాబాద్ జిల్లా రాష్ట్రానికి మార్గ ధర్శకంగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు. ఇందుకు ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లందరూ సహకరించాలని కోరారు. ఆదివారం హైదరాబాద్ లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో



అధికారులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇందులో ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల కు లబ్ధిదారుల ఎంపిక, కొత్త రేషన్ కార్డుల ప్రక్రియపై ప్రధానంగా చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నిరుపేదకు ఇళ్లు ఇవ్వడమే తన ప్రభుత్వ





లక్ష్యమన్న ఆయన హైదరాబాద్ లో స్థలం ఉండి ఇళ్లు లేని వారికి తొలి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి ఈ నెల 16 నుంచి 20వరకు క్షేత్ర స్థాయిలో లబ్ధిదారుల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఈ నెల 21 నుంచి అర్హులైన వారి వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేస్తామనీ, 26నుంచి కొత్త కార్డులు జారీ చేస్తామని చెప్పారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమన్న మంత్రి..గతంలో కూడా ప్రజల సహకారం ఉన్న పథకాలే విజయవంతం అయ్యాయని గుర్తు చేశారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్రూం లను కూడా ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పంపిణీ చేస్తామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్షంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయనీ అయినా తాము ప్రకటించిన హామీల అమలుకు కృషి చేస్తున్నామని చెప్పారు.ఇప్పటికే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 కే గ్యాస్, రూ. రెండు లక్షల రుణమాఫీ,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఆరోగ్య శ్రీ రూ. 10 లక్షలకు పెంచడంతో పాటు 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. సన్న వడ్ల కు 500 బోనస్ ఇచ్చి.. డైట్ చార్జీలు పెంచినట్లు వివరించారు. త్వరలోనే రైతు భరోసా కింద భూమి లేని రైతు కూలీలకూ రూ. 12వేలు ఇవ్వనున్నామన్నారు.

## జర్నలిస్టులకు గుండె పరీక్షలు

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టీయూడబ్ల్యూజే ఐజేయు మేడ్చల్ జిల్లా శాఖ అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఉచిత గుండె సంబంధిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సుస్రుత్ నేతృ త్వంలో బండారు ఆసుపత్రిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా బిజెపి రాష్త్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు విచ్చేసి వైద్య శిబిరాన్ని సంద ర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు విధినిర్వహణలో అదేవిధంగా వృత్తిప రమైన ఒత్తిడి లకు లోనై ఎంతో మంది జర్నలి స్టులు గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతు న్నారని సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహిం చుకుంటే వ్యాధులను అరికట్టే అవకాశం ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు ,జర్నలిస్టులు పాల్గొన్నారు.





## పద్మశాలీలు రాజకీయంగా ముందుకెళ్లాలి

### క్యాలెండర్ ఆవిష్కరణలో రాష్ట్ర నాయకులు

**కలంజ్యోతి, మల్యాల :**

మల్యాల మండల పద్మశాలి క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం మల్యాలలో ఘనంగా నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్షుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ పద్మశాలీలు ఒక్కటిగా రాజకీయంలో ముందుకు పోవాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో భోగ వెంకటేశ్వర్లు, మిట్టపల్లి సుదర్శన్, బొొట్ల ప్రసాద్, వీరబత్తిని ప్రసాద్, కొక్కుల రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.

# కలంజ్యోతి Cinema




## న్యాయం కోసం పోరాటం చేస్తా..

టాలీవుడ్ బ్యూటీ లావణ్య త్రిపాఠి 'మిస్ పర్ఫెక్ట్' వెబ్ సిరీస్‌లో ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం ఈ అమ్మడు మళ్లీ 'సతీ లీలావతి' సినిమాతో ఇండస్ట్రీకి రీ ఎంట్రీ ఇస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్ ఉంటూ పలు పోస్టులు షేర్ చేస్తోంది. తాజాగా, లావణ్య త్రిపాఠి న్యాయం కోసం సోషల్ మీడియాలో పోరాటం చేస్తోంది. ఈ మేరకు ఎక్స్ లో ఓ ట్వీట్ కూడా పెట్టింది. ఓ ప్రముఖ రిపోర్టర్ ముకేష్ చంద్రకర్ చత్తీష్ ఘడ్లో జర్నలిస్ట్ గా పని చేస్తున్నారు. అయితే వృతి పరంగా అతడు రోడ్ల నిర్మాణంలో జరిగిన  భారీ స్కామ్ ఆధారాలతో బయటపెట్టాడు. దాంతో అక్కడి లీడర్స్ అతడిని దారుణంగా హత మార్చి సెప్టిక్ ట్యాంక్ లో పడేశారు. ఈ ఘటనపై లావణ్య పోరాటం మొదలెట్టింది. అతడికి న్యాయం చేయాలంటూ ఎక్స్ లో హ్యాష్ ట్యాగ్ జోడించి మరీ ముకేష్ చంద్రకర్ పేరును పెట్టింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే ఇలాంటి ఘటనల్లో పెద్దగా సెలబ్రిటీలు స్పందించారు. కానీ ఏకంగా లావణ్య పోస్ట్ పెట్టడంతో నెట్టింట ప్రశంసలు కురిపిస్తున్నారు.